


రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి తటవర్తి రవికుమార్ (హైదరాబాద్) శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 3,050, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,200 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహర్ సోమవారం (ఉదయం)
రాజమండ్రి	6.21	4.49
కాకినాడ	6.22	4.49
అమలాపురం	6.22	4.49

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఎస్‌ఓగా భాస్కరరెడ్డి



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పౌర సరఫరాల అధికారి(ఎఫ్ఏసీ)గా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని **జిల్లా పౌర** సరఫరాల అధికారి కార్యాలయంలో **ఆయన** ఇన్‌చార్జి డీఎస్‌ఓగా బాధ్యతలు **చేపట్టారు.** భాస్కరరెడ్డి జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎస్‌ఓగా ఉన్న ఏఎస్‌ఓ ఎం.నాగాంజనేయులు స్థానంలో భాస్కరరెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో ఈ నెల 1న ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు ద్వితీయ సంవత్సరం రసాయన, వాణిజ్య శాస్త్రాలతో పాటు ఒకేషనల్ విభాగంలో గ్రూపు సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 17,894 మందికి గాను 17,651 మంది పరీక్షలు రాశారు. 243 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 991 మందికి గాను 874 మంది పరీక్షలు రాశారు. 117 మంది పరీక్షలు రాయలేదు. మొత్తం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోలేదని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ అధికారి ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం తెలిపారు.

నేడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల స్క్రీనింగ్ టెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: ఏపీపీఎస్సీ ద్వారా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం నిర్వహిస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఈ విషయం తెలిపారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక రాజీవ్‌గాంధీ విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 696 మంది హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్టుతో పాటు, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకుని రావాలని తెలిపారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందే కేంద్రంలోకి చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. పురుషోత్తపట్నం, సీతానగరం గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు పరీక్ష కేంద్రం మార్గంలో వెళ్తాయని, అభ్యర్థులు ఈ విషయం గమనించాలని సూచించారు. పరీక్ష కేంద్రం లోపలకు బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు మాత్రమే అనుమతిస్తారన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర పేపర్లు అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించారన్నారు. అవసరమైతే వైద్య సహాయం అందించడానికి మెడికల్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా, అలాగే, కళాశాలలో అవసరమైన ఏర్పాట్లపై యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని జేసీ చిన్నరాముడు అన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు జె.చంద్రరావు, జె.జనార్దన్, సమన్వయ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా 143 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. బాలురు 12,791, బాలికలు 11,972 కలిపి మొత్తం 24,763 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. అలాగే, ప్రైవేటుగా 960 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు 1,100 మంది ఇన్విజిలేటర్లను, 10 ప్రత్యేక బృందాలను నియమించారు. ఇప్పటికే సెట్–1, సెట్–2 ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు జిల్లాకు చేరాయి. వీటిని జిల్లావ్యాప్తంగా 22 పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. కడియపులంక, పోతవరం, రాజుపాలెం జెడ్పీ హైస్కూళ్లు, ధవళేశ్వరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. వీటి వద్ద అదనపు భద్రత ఏర్పాటు చేశారు.

‘వాహనాల ఫిట్‌నెస్‌కు అక్కడ సంప్రదించండి’



జిల్లా రవాణా అధికారి సురేష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్‌కు ఇకపై రాజానగరంలోని కంట్రోల్ ఆల్ట్ ఫిక్స్ సొల్యూషన్స్ ప్రైవేటు సంస్థను సంప్రదించాలని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ శనివారం తెలిపారు. అన్ని రకాల మోటారు వాహనాల ఫిట్‌నెస్ నిర్వహణను ఈ ఏజెన్సీ నిర్వహిస్తుందన్నారు. ఆ సంస్థ ప్రతినిధులు వాహనాల తనిఖీలు నిర్వహించి, ధ్రువ పత్రాలు జారీ చేస్తారని పేర్కొన్నారు.

సేంద్రియ సాగు.. భళా

- 44 వేల ఎకరాలు.. 37 వేల మంది రైతులు
- వరి, ఉద్యాన, కూరగాయ పంటల సాగు
- భూసారానికి మేలు
- నిండుగా దిగుబడులు.. దండిగా లాభాలు



ముక్కామలలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న జామ తోటను పరిశీలిస్తున్న అధికారులు



కాకరపాదులకు కషాయాలు పిచికారీ చేస్తున్న రైతులు

పెరవలి: జిల్లాలోని రైతులు సేంద్రియ వ్యవసాయంతో మంచి లాభాలు పండించుకుంటున్నారు. ఇప్పటి వరకూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతూ చేస్తున్న సాగుతో భూమి చౌడుబారుతున్నాయి. పైగా రసాయనిక ఎరువులతో పండించిన ఆహార ధాన్యాలు తినడం ఆరోగ్యానికి చేటు తెస్తుందనే అవగాహన చాలా మందిలో పెరుగుతోంది. ఫలితంగా ఈ విధానంలో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి పలు దేశాలు విముఖత చూపుతున్నాయి. పైగా పెట్టుబడి ఎక్కువ.. రాబడి తక్కువ అన్నట్లుగా ఈ విధానం ఉండటంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో సేంద్రియ సాగు విధానాలపై సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తుండటంతో రైతులు కూడా చైతన్యవంతమవుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వస్తుండటం.. పైగా ఆర్గానిక్ ఉత్పత్తుల వాడకంపై ప్రజల్లో స్పృహ పెరగడంతో జిల్లాలోని పలువురు రైతులు ప్రకృతి సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఎక్కడెక్కడంటే..

గతంలో చాలా తక్కువ మంది మాత్రమే సేంద్రియ సాగు పద్ధతులు అవలంబించగా.. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 37 వేల మంది రైతులు ఏకంగా 44,357 ఎకరాల్లో ఈ విధానంలో పంటలు పండిస్తున్నారు. ముఖ్యంగా పెరవలి, నిడదవోలు, ఉండ్రాజవరం, చాగల్లు, కొవ్వూరు, నల్లజర్ల, తాళ్లపూడి, కడియం తదితర మండలాల్లో అధిక సంఖ్యలో రైతులు ప్రకృతి సాగు చేస్తున్నారు. వరి, వాణిజ్య పంటలైన బొప్పాయి, అరటి, జామతో పాటు వంగ, బెండ, దొండ, చిక్కుడు, పొట్ల, బీర, ఆనప, కాకర వంటి కూరగాయలను సైతం సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. వరి అయితే ఎకరానికి 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడులు సాధించి, దండిగా లాభాలు ఆర్జిస్తున్నారు. పెరవలి మండలం అన్నవరప్పాడు, మల్లేశ్వరం, ఖండవల్లి, ముక్కామల, తీపర్రు, కాపవరం, అజ్జరం, కాకరపర్రు, వెంకట్రాయపురం, నల్లాకులవారిపాలెం గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లో సేంద్రియ సాగు జరుగుతోంది.

ఇదీ మేలు

రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించడంతో వలన భూములు చౌడుబారి, సారం కోల్పోతున్నాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుపై నిర్లక్ష్యం వహించడం వలన కూడా ఈ పరిస్థితి ఏర్పడింది. సేంద్రియ సాగులో పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్ల సాగు వంటివి ప్రధాన భూమిక పోషిస్తాయి. జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి పంటలు వేస్తే భూమికి ఎకరానికి రెండు టన్నుల ఎరువు అందుతుందని అధికారులు చెబుతున్నారు. కేవలం కషాయాలతో, పశువుల ఎరువుతో చేపట్టే ఈ సాగు వలన భూసారం పెరిగి, తెగుళ్ల వ్యాప్తి కూడా తగ్గుతోంది. ముఖ్యంగా బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, నీమాస్త్రం, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య వంటివి సొంతంగా తయారు చేసి పంటలపై పిచికారీ చేస్తుండటంతో తెగుళ్ల నివారణ సులువవుతోంది. మూడేళ్లుగా ప్రకృతి సాగు విధానాలు అవలంబించడంతో పంట భూములు ఎంతో సారవంతంగా మారాయని రైతులు అంటున్నారు. పైగా సేంద్రియ విధానంలో పండించిన పంట దిగుబడులకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోందని చెబుతున్నారు.

డ్రోన్లతో పిచికారీ

సేంద్రియ వ్యవసాయంలో జిల్లా అధికారులు ఓ అడుగు ముందుకు వేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వ్యవసాయంలో పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వినియోగాన్ని ప్రారంభించారు. జిల్లా అధికారులు దీనిని అందిపుచ్చుకుని కషాయాల పిచికారీకి కూడా డ్రోన్లు వినియోగిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని ప్రతి మండలంలో 250 ఎకరాల్లో డ్రోన్ల ద్వారా కషాయాలు పిచికారీ చేయాలని నిర్ణయించారు. డ్రోన్‌తో పిచికారీకి ఎకరానికి రూ.350 నుంచి రూ.400 వసూలు చేస్తున్నారు. మామూలుగా మనుషులతో ఎకరం విస్తీర్ణంలో పిచికారీ చేయాలంటే ఒక రోజు పడుతుంది. అదే డ్రోన్‌తో కేవలం 10 నిమిషాల్లో పూర్తవుతోంది. ఖర్చుతో పాటు సమయం కూడా ఆదా అవుతుండటంతో రైతులు డ్రోన్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

రూ.50 వేల లాభం



సేంద్రియ విధానంలో రెండేళ్ల కిందట అరటి సాగు చేపట్టాను. గత ఏడాది ఎకరానికి రూ.50 వేల లాభం వచ్చింది. పెట్టుబడి తక్కువ.. నాణ్యమైన దిగుబడులు రావడంతో మార్కెట్టులో మంచి ధర లభించింది. ప్రస్తుతం అరటితో పాటు వరి కూడా ఇదే పద్ధతిలో సాగు చేస్తున్నాను. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం మాని, తెగుళ్ల నివారణకు కేవలం కషాయాలే వినియోగిస్తున్నాను.

– **ఇ.కన్నయ్య, రైతు, ఖండవల్లి,** పెరవలి మండలం


పెట్టుబడి తక్కువ



సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేశాను. గత ఏడాది అరెకరంలో సాగు చేస్తే మంచి ఆదాయం వచ్చింది. ఇప్పుడు మూడెకరాల్లో అన్ని రకాల కూరగాయలూ పండిస్తున్నాను. ఈ విధానంలో పెట్టుబడి తక్కువ. అంతే కాకుండా భూసారం పెరిగి, మంచి దిగుబడులు వస్తున్నాయి. సేంద్రియ వ్యవసాయమే మేలు.

– **కె.శ్రీరామమూర్తి,** రైతు, ఖండవల్లి

రైతులను ప్రోత్సహించాం



సేంద్రియ సాగు విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో రైతులతో ముఖాముఖీ చర్చలు జరిపి, పోత్సహించాం. వారిని ఒప్పించడానికి మొదట చాలా ఇబ్బందులు పడ్డాం. మూడేళ్ల పాటు శ్రమ పడ్డాం. ఆ ఫలితం ఇప్పుడు వస్తోంది. పెరవలి మండలంలోని రైతులు 2,500 ఎకరాల్లో వివిధ పంటలు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్ని రకాల పంటలూ పండిస్తుండటంతో గతంలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలు సైతం ఇక్కడకు వచ్చి స్వయంగా పరిశీలించారు.

– **తాతారావు,** సేంద్రియ సాగు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

ఎక్కువ రేటుకు ఎందుకు అమ్ముతున్నారు?

- **ఇసుక వి**క్రయాలపై ప్రత్యేకాధికారి ప్రశ్న
- **అధికారు**లు, ఏజెన్సీలతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ‘గతంలో టన్ను ఇసుక ధర రూ.475 ఉంది. ఏజెన్సీలు రూ.229కి కోట్ చేశాయి. కానీ, ఇప్పటికీ రూ.400కు పైగా అమ్ముతున్నారు. దీనికి కారణమేమిటి?’ అని మైన్స్ కమిషనర్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఇసుక సరఫరా ఏజెన్సీలు సాధ్యం కాని ధర ప్రతిపాదించి, ఎక్కువ రేటుకు ఎందుకు అమ్ముతున్నాయని నిలదీశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన డీఎల్ఎస్ఏ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇదే తీరు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై నిర్వహించే సమావేశానికి ఓపెన్, డీసిల్టేషన్ ఏజెన్సీలు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. జరిగిన తప్పులు సరిచేసుకోవాలని, ఇకపై రీచ్‌లలో ప్రభుత్వ సిబ్బందిని కూడా నియమిస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. వినియోగదారులతో నేరుగా సంభాషిస్తామన్నారు. మొదట వచ్చిన వారికి మొదట ఇసుక అందించేలా రవాణా వ్యవస్థ ఉండాలన్నారు. ఇసుక తవ్వకాల సందర్భంగా పర్యావరణ అనుమతుల విషయంలో ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కచ్చితమైన మార్గదర్శకాలు పాటించాలని అన్నారు. రవాణా వ్యవస్థపై పర్యవేక్షణ తప్పనిసరని స్పష్టం చేశారు. పనితీరు సరిగ్గా లేని కొన్ని ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్, మైన్స్ ఈడీ డి.ఫణిభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు ఎత్తేసి.. నేడు తొక్కేసి..



- కూరలో కరివేపాకులా మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి
- నాగబాబు ‘ఖర్మ’ కామెంట్లపై తమ్ముళ్ల ఆగ్రహం
- వర్మనుద్దేశించే అన్నారని మండిపాటు
- ఇదంతా చంద్రబాబు వ్యూహమని ప్రచారం
- పొమ్మనకుండా పొగ పెడుతున్నారంటున్న టీడీపీలోని ఒక వర్గం
- పిఠాపురంలో ‘దేశా’నికి ‘చంద్ర’ గ్రహణం!

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆరు నెలలు సావాసం చేస్తే వారు, వీరవుతారంటారు. కూటమిగా జత కట్టి.. అమలు కాని హామీలతో ప్రజలను నమ్మించి.. నట్టేట ముంచుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల విషయంలో ఈ మాట నిజమేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అవసరానికి వాడుకుని, పని అయిపోయాక కూరలో కరివేపాకులా తీసి పడేసే తత్వం ఇంత కాలం చంద్రబాబుకే సొంతమనుకునే వారు. ఇప్పుడు చంద్రబాబుతో చెట్టపట్టాలేసుకు తిరుగుతున్న పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబు కూడా ఆ తత్వాన్ని ఒంట పట్టించుకున్నట్టు కనిపిస్తోంది. పిఠాపురం శివారు చిత్రాడలో శుక్రవారం రాత్రి జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో పవన్ సోదరుడు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు చేసిన వ్యాఖ్యలే దీనికి అద్దం పడుతున్నాయి. ‘పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపులో ప్రధానంగా రెండు ఫ్యాక్టర్స్ పని చేశాయి. ఒకటి జనసేన ప్రెసిడెంట్ పవన్ కల్యాణ్. రెండు జనసైనికులు, పిఠాపురం ఓటర్లు’ మరెవరైనా పవన్ గెలుపులో తమ పాత్ర ఉందని అనుకుంటే అది వారి ఖర్మ’ అని నాగబాబు నొక్కి మరీ చెప్పారు. ఆ మాటలకు అర్థాలే వేరని ఆ సభలోనే జనసేన అభిమానులు, కార్యకర్తలు గుసగుసలాడటం వినిపించింది. నాగబాబు చేసిన వ్యాఖ్యలు పిఠాపురానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మను ఉద్దేశించినవేనని ఆయన అనుచరులు, టీడీపీ కార్యకర్తలు బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

పొగడిన నోటితోనే..

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 2019 సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక, భీమవరంలో పోటీ చేసి, రెండుచోట్లా ఓడిపోయారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఒకే ఒక్క స్థానం పిఠాపురంలో గెలుపొందారు. ఈ గెలుపులో జనసేన ఎంత పని చేసిందో, స్థానిక టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, ఆయన అనుచర గణం కూడా అంతే స్థాయిలో పని చేసిందనేది జగమెరిగిన సత్యం. పరాజయాల నేపథ్యంతో గత సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురాన్ని ఎంపిక చేసుకున్నప్పటి నుంచి, గెలుపొందే వరకూ వర్మను ఇంద్రుడు, చంద్రుడు అంటూ ఆకాశానికెత్తేయడంలో మెగా బ్రదర్స్ పవన్ కల్యాణ్, నాగబాబు పోటీ పడ్డారు. ‘ఈ విజయం జనసైనికులది. ఈ విజయం వర్మది’ అంటూ స్వయంగా పవన్ కల్యాణ్ పలు సభల్లో వర్మను ప్రశంసలతో ముంచెత్తారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ అన్నదమ్ములిద్దరూ వర్మను నెత్తిన పెట్టుకున్నారు. అధికారంలో భాగస్వాములై, పవన్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక అసలు స్వరూపం బయటపడిందని, వర్మను రాజకీయంగా పాతాళానికి తొక్కేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అనుచర వర్గం మండిపడుతోంది.

విస్తృతంగా చర్చ

నేడు మెగాబ్రదర్స్ వ్యాఖ్యలు చూస్తుంటే ‘ఓడ ఎక్కే వరకూ ఓడ మల్లన్న.. ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న’ సామెతను తలపిస్తోందని అంటున్నారు. సార్వత్రిక ఎన్నికలయ్యేంత వరకూ వర్మను వేనోళ్ల పొగిడిన మెగా సోదరులు ఇంతలోనే ఇంతలా మారిపోతారని ఊహించలేదని తెలుగు తమ్ముళ్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలప్పుడు పిఠాపురంలో జరిగిన ఒక సభలో వర్మను ఆకాశానికెత్తేస్తూ మెగా బ్రదర్స్ పొగుడుతున్న వీడియో, శుక్రవారం రాత్రి చిత్రాడ సభలో నాగబాబు వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ అంశం ఇప్పుడు కూటమి పార్టీల మధ్య హాట్‌టాపిక్‌గా మారింది. ఎక్కడ ఏ నలుగురు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. పవన్ కల్యాణ్ తరచూ మార్పు రావాలంటున్నారని, చివరకు చిత్రాడ సభలో సైతం ఇదే విషయాన్ని ఊదరగొట్టారని, మార్పు అంటే ఇదేనా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

చంద్రబాబు మొండిచేయి

పొత్తు ధర్మంలో భాగంగా పిఠాపురం సీటు త్యాగం చేసిన వర్మకు చంద్రబాబు భారీ హామీయే ఎర వేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక తొలి ఎమ్మెల్సీ పదవిని ఆయనకే ఇస్తామని గొప్పగా ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుమూడు దఫాలు ఎమ్మెల్సీల నియామకాల జరిగినా వర్మకు మాత్రం మొండిచేయే చూపించారు. పని అయ్యే వరకూ బుజ్జగించడం.. ఆనక గాలికొదిలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అనే విమర్శ ఉంది. అయితే, అదే వాస్తవమని వర్మకు ఎమ్మెల్సీ పదవి విషయంలో మరోసారి రుజువైందని అంటున్నారు. అయితే, వర్మకు జెల్ల కొట్టడానికి వేరే కారణముందనే చర్చ కూడా నడుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో సీటు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ వర్మ అనుచరులు పిఠాపురంలో చంద్రబాబు, లోకేష్ దిష్టిబొమ్మలు, పార్టీ జెండాలు దహనం చేశారు. చంద్రబాబు, లోకేష్‌లను బూతులు తిట్టారు. దీనిని మనసులో పెట్టుకుని, చంద్రబాబు, లోకేష్‌లు వ్యూహాత్మకంగానే వర్మను తొక్కేస్తున్నారని, మెగాబ్రదర్స్ ద్వారా పొమ్మనకుండానే పొగ పెడుతున్నారని టీడీపీలోని ఒక వర్గం అంటోంది. లేకుంటే వర్మను నాగబాబు పదేపదే టార్గెట్ చేస్తున్నా అధినేతలు ఎందుకు మాట్లాడటం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మాజీ ఎమ్మెల్యే వర్మ, నాగబాబు మధ్య ఎన్నికల సమయంలో రగిలిన చిచ్చు అధికారంలోకి వచ్చాక కూడా కొనసాగుతూనే ఉంది. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోగా.. ఆయనను నిత్యం విభేదించే మెగా బ్రదర్ నాగబాబుకు ఆ పదవి ఇచ్చారు. నాగబాబును రేపోమాపో మంత్రిని కూడా చేస్తారనే ప్రచారంతో పిఠాపురంలో వర్మ అనుచరులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే నియోజకవర్గంలో టీడీపీ ఉనికే ప్రమాదంలో పడుతుందని తెలుగు తమ్ముళ్లు పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అవశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ ర్యాలీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రచార కార్యక్రమాలు, ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రజాప్రతినిధులు మాటలకు పరిమితం కాకుండా ప్రత్యక్షంగా ఇందులో భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. దీనికోసం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
కిలో	260

ఉత్సాహంగా పవర్ లిఫ్టింగ్ పోటీలు



విజేతలకు షీల్డు అందజేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: పోతవరం గ్రామంలోని ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్ ఆవరణలో శనివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ చాంపియన్, బెంచ్ ప్రెస్ 2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఎస్ఎస్ ఫిట్‌జోన్ అధినేత, కార్యక్రమ నిర్వాహకుడు కత్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ద్వారా మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పవర్ లిఫ్టింగ్, బ్రెంజి ప్రెస్‌లో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్, కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో సుమారు 150 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. 10 కేటగిరీల్లో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుమల కృష్ణపద్మరాజు, కార్యదర్శి ఒంటెద్దు వెంకన్నాయుడు, ఈవెంట మేనేజర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ ఫిట్‌నెస్ అధినేత కత్తుల శ్రీనివాస్, దవులూరి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లు హాజరు కాకుంటే ఎలా?

- తూర్పుగోదావరి, కోనసీమ జిల్లా అధికారులపై సభ్యుల ధ్వజం
- పలు అంశాలపై జెడ్పీ సమావేశంలో చర్చ



సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న కాకినాడ కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: జెడ్పీ సర్వసభ్య సమావేశంలో అజెండాలోని అంశాలపై జరిగే చర్చలకు తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు హాజరు కాకపోవడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరావులతో పాటు ఆయా జిల్లాల జెడ్పీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా సమకూరిన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల తీర్మానాలతో ప్రమేయం లేకుండా కలెక్టర్లు తమ ప్రాధాన్యం ప్రకారం కేటాయించడంపై సభ్యులు అభ్యంతరం తెలుపుతూ, ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని చైర్మన్ వేణుగోపాలరావును కోరారు.

మూడు జిల్లాలోని గోదావరి కాలువ చివరి ఆయకట్టు భూముల్లోని పంటలు సాగునీరు అందక ఎండిపోతున్న పరిస్థితిపై సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తూ, వంతుల వారీ విధానం, డ్రైన్ల నుంచి లిఫ్టింగ్ ద్వారా పంటలను కాపాడాలని కోరారు. కాలువల ఎగువ ప్రాంతాల్లోని రైతులకు సక్రమంగా నీటిని వదులుతున్నప్పటికీ అదనపు నీటిని అక్రమంగా తోడుతుండడం వల్ల శివారు భూములకు నీరు అందడం లేదని, ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు.

తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ యానాం–ద్రాక్షారామ ప్రధాన రహదారిలో ఆరేళ్లుగా వంతెన శిథిలస్థితికి చేరడం వల్ల కాలువకు తూరలు వేసి పైన సీసీ రోడ్డు వేశారని, ఫలితంగా నీరు సక్రమంగా పారకపోవడం, ఆ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న సుమారు 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇంజరం వద్ద పూర్తిస్థాయిలో వంతెన నిర్మించి రైతులను ఆదుకోవాలని, ప్రజల రాకపోకలలో ఇబ్బందులు తొలగించాలని కలెక్టర్ కోరారు. దీనిపై కలెక్టర్ షణ్మోహన్ స్పందించి ఈ విషయం పూర్తి స్థాయిలో అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అలాగే పౌరసరఫరాల ద్వారా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న నాసిరకమైన కొత్త బియ్యం వండినప్పుడు ముద్దవుతోందని, పిల్లలు తినడానికి ఇష్టపడడం లేదని కొందరు సభ్యులు ప్రస్తావించారు. మండలాల్లో నిర్వహించిన పనులకు చెల్లింపులు జాప్యం లేకుండా జరపాలని కోరారు.

జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాలు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని, ఆరోగ్యంపై వ్యయాన్ని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు కోరారు.

కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ స్లిప్పులు జారీ చేయాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు కోరారు.

గిరిజన ప్రాంత ప్రజల సమస్యలపై చర్చ, పరిష్కారానికి ఐటీడీఏ సర్వ సభ్య సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌తో పాటు, ఏఎస్ఆర్ జిల్లా పరిధి జెడ్పీటీసీ సభ్యులు కోరారు. దీనిపై ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం స్పందిస్తూ ఏప్రిల్ చివరి లేదా మే తొలివారంలో తదుపరి సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అలాగే గిరిజన ప్రాంత సమస్యలపై సభ్యులు ప్రస్తావించిన అంశాలకు ఆయన వివరణలు ఇచ్చి సమస్యలన్నింటినీ సత్వరం పరిష్కరిస్తామన్నారు.

తమ జిల్లాలకు సంబంధించి సభ్యులు లేవనెత్తిన అంశాలపై చర్యలు చేపడతామని తూర్పు గోదావరి జిల్లా జేసీ చినరాముడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో రాజకుమారి సభ్యులకు వివరించారు.

సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన సభ్యులు, అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రజాసమస్యలపై సత్వరం సమగ్ర పరిష్కారాలు అందించాలని నాలుగు జిల్లాల అధికారులను చైర్మన్ వేణుగోపాలరావు కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఏవో ఎం.బుజ్జిబాబు, జెడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నాలుగు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు

రూ.1014 కోట్లతో బడ్జెట్‌కు ఆమోదం

రూ.70 లక్షల మిగులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1,014 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. ఉమ్మడి జెడ్పీ బడ్జెట్ సర్వసభ్య సమావేశం శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, తూర్పుగోదావరి జిల్లా జేసీ ఎస్ చినరాముడు, రంపచోడవరం జేసీ కట్టా సింహాచలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఆర్ఓ బీఎల్ఎస్ రాజకుమారి పాల్గొన్నారు. సమావేశాన్ని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రారంభించగా తొలుత దివంగతులైన కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతికి సంతాపం ప్రకటిస్తూ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో 2024–25 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను, 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన అంచనా బడ్జెట్ ముసాయిదాను జెడ్పీ పరిపాలనాధికారి సభ్యులకు వివరించారు. అనంతరం బడ్జెట్‌లో పొందుపరిచిన ప్రతిపాదనలపై సమావేశం చర్చించి 2024–25 సంవత్సరానికి సవరించిన ఆదాయం రూ. 846.60 కోట్లు, సవరించిన వ్యయం రూ. 845.95 కోట్లతో రూ.65 లక్షలు మిగులుతో సవరించిన బడ్జెట్‌ను ఆమోదించారు. అదే విధంగా రానున్న 2025–26 ఆర్థిక సంవత్సరానికి అన్ని పద్దులు కలిపి మొత్తం ఆదాయం అంచనా రూ.1013.80 కోట్లు కాగా, అన్ని పద్దుల కింద అంచనా వ్యయం రూ. 1013.10 కోట్లతో, రూ.70 లక్షలు మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. ఆదాయంలో జెడ్పీ సాధారణ నిధులు రూ. 28 కోట్లు, ప్రభుత్వం నుంచి కేటాయించిన శాలరీ గ్రాంటులు రూ.10.48 కోట్లు, నిర్దిష్ట ప్రయోజన గ్రాంటు రూ.46.09 కోట్లు, డ్వామా, గ్రామీణ నీటి సరఫరా, ఇతర శాఖల ద్వారా వచ్చే గ్రాంటు రూ. 922.39 కోట్లుగా ఉన్నాయి. జెడ్పీ సాధారణ నిధుల నుంచి షెడ్యూల్ కులాల సంక్షేమానికి 15 శాతం కేటాయింపు రూ. 2.97 కోట్లు, షెడ్యూల్ తెగల సంక్షేమానికి 6 శాతం కేటాయింపు రూ.1.19 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి 15 శాతం కేటాయింపు, రూ.2.97 కోట్లు, అభివృద్ధి పనులకు 23 శాతంగా రూ.4.55 కోట్లు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశుసంవర్థక, సాంఘిక సంక్షేమం తదితర సెక్టార్లకు 10 శాతంగా రూ. 2.97 కోట్లు కేటాయింపులను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఆస్తులను పరిరక్షిస్తూ, ఆదాయ వనరులను మరింత పెంచాలని సభ్యులు కోరారు.

రాజమండ్రిలో సీన్ తీస్తే సూపర్ హిట్టే



విలేకరులతో మాట్లాడుతున్న హీరో నితిన్, చిత్రంలో హీరోయిన్ శ్రీలీల, దర్శకుడు వెంకీ కుడుముల

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తను హీరోగా నటించిన రాబిన్ హుడ్ చిత్రం అందరికీ నచ్చుతుందని హీరో నితిన్ అన్నారు. గతంలో వెంకీ కుడుముల దర్శకత్వంలో తను నటించిన భీష్మ మంచి విజయం సాధించిందని, ఆ సినిమాలో ఒక సన్నివేశం రాజమండ్రిలో చిత్రీకరించామని అది హిట్టని అన్నారు. ఆ సెంటిమెంటుతో రాబిన్ హుడ్ సినిమాలో ఒక సీన్ ఇక్కడ చిత్రీకరించామని, ఇది కూడా సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 28 న విడుదల కానున్న ఈ చిత్రం ప్రమోషన్ కోసం రాజమండ్రి వచ్చిన చిత్ర బృందం శనివారం మధ్యాహ్నం మంజీరా హోటల్‌లో మీడియాతో మాట్లాడింది. నితిన్ మాట్లాడుతూ దర్శకుడు వెంకీ తొలి చిత్రం చలో నుంచి తనకు పరిచయం ఉందని తర్వాత తమ కాంబినేషన్‌లో వచ్చిన భీష్మ చిత్రం విజయం సాధించిందన్నారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ ఇప్పటికే రాబిన్ హుడ్ టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన వస్తోందని సినిమా కూడా హిట్టవుతుందన్న నమ్మకం ఉందని చెప్పారు. శ్రీలీల ఈ చిత్రంలో మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చినట్టు వెంకీ తెలిపారు. శ్రీలీల మాట్లాడుతూ తనకు రాజమండ్రి కొత్తకాదని తమ గ్రాండ్ ఫాదర్ ధవళేశ్వరంలో ఉండేవారని చెప్పారు. ఈ సినిమాలో తన పాత్రను ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారని, పిల్లలతో కలిసి చూడాలని కోరారు.

పదిలో పట్టు.. భవితకు మెట్టు

- ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి
- ఆహార నియమాలతో మానసిక ప్రశాంతత
- తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం
- విద్యార్థులూ.. విజయానికి సూత్రాలివిగో..



రాయవరం: విద్యార్థి ప్రగతికి పదో తరగతి తొలి మెట్టు. పరీక్షలు అనగానే సహజంగానే విద్యార్థులు భయం, ఆందోళన చెందుతూ ఉంటారు. ఆ భయాన్ని వీడి పరీక్షలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొంటే వారి భవిష్యత్ బంగారమవుతుంది. ఆత్మవిశ్వాసం..ఏకాగ్రత..మంచి ఆహారం..కొద్ది సేపు ధ్యానం అవసరం. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

టెన్షన్ వద్దు

పరీక్షలు ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులు టెన్షన్ వదిలి అటెన్షన్‌గా ఉండాలి. ప్రిపరేషన్ ఎంత అవసరమో దానిని పేపర్‌పై పెట్టగలగడమూ అంతే అవసరం. దానికి తోడు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మనసు, శరీరమూ కూడా ప్రశాంతంగా ఉంటాయి. అలాగే పరీక్షలు రాసే ముందు పునశ్చరణ ఉండాలే తప్ప కొత్త పాఠ్యాంశం జోలికి వెళ్లకూడదు.

ప్రజెంటేషన్ చాలా ముఖ్యం

పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు పాజిటివ్ థింకింగ్, ప్లానింగ్, ప్రిపరేషన్, ప్రివ్యూ, ప్రజెంటేషన్ అలవర్చుకోవాలి. వీటితో పాటు పరీక్ష ముందు రోజు తగినంత నిద్రపోవాలి. నిద్ర మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుంది. నేను బాగానే రాయగలను అనే పాజిటివ్ థింకింగ్‌తో పరీక్షా కేంద్రానికి వెళ్లాలి. ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాసి, తరువాత కష్టంగా అనిపించిన ప్రశ్నలకు జవాబులు రాయాలి. రేపటి పరీక్షను చక్కగా రాస్తున్నట్లుగా ముందుగానే మనసును సిద్ధం చేయాలి. కొత్త వాతావరణంలో పరీక్షలు రాస్తున్నామనే భయం వద్దు. జవాబు పత్రంలో కొట్టివేతలు, దిద్దుబాట్లు లేకుండా, చక్కటి దస్తూరీతో సమాధానాలు రాస్తే మంచిది.

తల్లితండ్రుల పాత్ర కీలకం

పరీక్షల సమయంలో మంచి ర్యాంకు, ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే ఒత్తిడిని పిల్లలపై రుద్దకూడదు. ఇతరులతో పోల్చడం, గతంలో మార్కులు తక్కువ వచ్చిన అంశాలతో వారిని తక్కువ చేయకూడదు.

ఇవి పాటిస్తే మంచిది

జవాబు పత్రంలో ఒక్కో పేజీపై 16 నుంచి 18 లైన్లకు మించకుండా సమాధానాలు రాయాలి. ముఖ్యమైన అంశాల కింద అండర్‌లైన్ చేయాలి. గణితంలో అంకెలు స్పష్టంగా వేసుకోవాలి. తెలుగులో అక్షరాలు స్పష్టంగా కనబడేటట్లుగా రాయాలి. నీలం లేదా నలుపు రంగు సిరా ఉన్న పెన్నులు లేదా బాల్‌పెన్నులు మాత్రమే వాడాలి.

సానుకూల దృక్పథం అవసరం



ఎటువంటి ప్రశ్నలకైనా సమాధానాలు రాయగలననే సానుకూల దృక్పథాన్ని విద్యార్థులు కలిగి ఉండాలి. పరీక్ష ముగిసిన తర్వాత సమాధానాలు సరిపోల్చుకోకూడదు. అలా చేస్తే తరువాతి పరీక్షకు సరిగ్గా సన్నద్ధం కాలేరు. పరీక్షకు వెళ్లే ముందు వజ్రాసనం వేసుకుని ధ్యానం చేసుకుంటే ఎటువంటి ఒత్తిడినైనా అధిగమించవచ్చు. పరీక్షలకు ముందు అలసట, నిద్రలేమి లేకుండా చూసుకోవాలి. కనీసం ఆరు గంటల నిద్ర అవసరం. సాత్విక ఆహారాన్ని తీసుకోవాలి. రివిజన్‌కు అధిక ప్రాధాన్యతనివ్వాలి.

– డాక్టర్ సౌమ్య పసుపులేటి, సైకియాట్రిస్ట్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

ఆరోగ్యం ముఖ్యం



పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. విద్యార్థులు పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగా ఆరోగ్యంగా ఉండాలి. ఎండలు పెరుగుతున్న పరిస్థితుల్లో తక్షణ శక్తి కోసం కొబ్బరి నీళ్లు, గ్లూకోజ్, తరచూ తీసుకోవాలి. కలుషితం కాని నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి. మాంసాహారాన్ని తగ్గించడం ఉత్తమం.

– డాక్టర్ అనిరుథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

వాడవాడలూ వాడపల్లివైపే..



వాడపల్లి ఆలయ మాడ వీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న భక్తజనం

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రానికి అత్యధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, భారీ క్యూ లైన్లలో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించే భక్తులతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో సేవలు ప్రారంభించగా భక్తులు స్వామి వారిని దర్శించి అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కూలర్లు ఏర్పాటు చేశారు. శనివారం స్వామివారికి వివిధ రూపాల్లో రూ. 42,59,486 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రించి, శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి బస్సు సర్వీసులను నడిపింది.